# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 25-11-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ఇంటి పైకప్పుపై సౌర విద్యుత్ ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం రాయితీ అందిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పలు కీలక బిల్లులను ఆమోదించడం జరిగిందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.
- ❖ డోలీ మోతలకు స్వస్తి పలకాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈరోజు సాలూరు మండలం కరడవలస గ్రామంలో కంటైనర్ ఆసుపత్రిని మంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రారంభించారు.
- ❖ కార్తీక మాసం ఆఖరి సోమవారం కావడంతో ఈరోజు రాష్ట్రంలోని శైవ క్షేత్రాలు ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నాయి.
- ❖ దక్షిణ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం రాబోయే 24 గంటల్లో మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని విశాఖపట్నంలోని తుఫానుల హెచ్చరికల కేంద్రం వెల్లడించింది.

====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈరోజు విద్యుత్ శాఖపై సమీక్ష నిర్వహించారు. సౌర విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించడంలో రాష్ట్రంలో చేపడుతున్న కార్యక్రమాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. “పీఎం సూర్య ఘర్”, “కుసుమ్ పథకం”, “సోలార్ విలేజ్” అంశాలపై చర్చించిన ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమీక్షలో పలు జిల్లాల కలెక్టర్లు, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు, ఎపి ఇపిడిసిఎల్ అధికారులు దృశ్యమాధ్యమ విధానంలో పాల్గొన్నారు. షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన పేద ప్రజలకు సౌర విద్యుత్తు అందించడానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఈ సందర్భంగా ఆదేశించారు. 200 యూనిట్లు లోపు విద్యుత్ వినియోగిస్తున్న లబ్ధిదారులకు ఉచితంగా విద్యుత్తును అందిస్తున్నామని, ఇంటి పైకప్పుపై సౌర విద్యుత్ ఏర్పాటు చేసుకోవడానికి ఆసక్తి చూపించే లబ్ధిదారులకు రాయితీలు అందిస్తామన్నారు. ఒక కిలో వాట్ సౌర విద్యుత్తు ఏర్పాటు

చేయడానికి 50 వేల రూపాయలు ఖర్చవుతుందని, 30 వేల రూపాయలు ప్రభుత్వం రాయితీ అందిస్తుందని, 20 వేల రూపాయలు లబ్దిదారుని వాటాగా చెల్లించాలని అన్నారు.

=====================

ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా పలు కీలక తీర్మానాలు చేసి వివిధ బిల్లులను ఆమోదించడం జరిగిందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మచిలీపట్నం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో మంత్రి ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తూ.. ప్రజా సమస్యలపై ఉభయ సభల్లో చర్చించి నిధులను కేటాయించి పనులు త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉచిత ఇసుక విధాన పాలసీని తీసుకువచ్చి రాష్ట్రంలో నిర్మాణ రంగం ద్వారా అసంఘటిత కార్మికులకు ఉపాధి ఏర్పడేలా చర్యలు తీసుకున్నామని, రహదారుల నిర్మాణానికి పి క్యూట్ పద్ధతిలో టెండర్లను పిలిచి గ్రామీణ ప్రాంతాలను పట్టణాలతో కలిపే విధంగా మొదటి దశలో నిర్మాణ పనులు చేపడుతున్నామని మంత్రి వివరిస్తూ....

(వాయిస్ 24 సెకన్లు)

=====================

పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం తోణాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న గిరిశిఖర గ్రామమైన కరడవలసలో కంటైనర్ ఆసుపత్రిని ఈరోజు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అనార్యోగానికి గురైన వారిని, ప్రసవాల కోసం గర్భిణులను డోలీలో మోసుకుంటూ కొండలపై నుంచి కిందకు తీసుకువెళ్తున్న పరిస్థితి ప్రభుత్వం దృష్టికి రావడంతో... ఇక డోలి మోతలకు స్వస్తి పలకాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పైలట్ ప్రాజెక్టుగా కరడవలసలో కంటైనర్ ఆసుపత్రిని నెలకొల్పామన్నారు. ఈ కంటైనర్ ఆసుపత్రికి "గిరి ఆరోగ్య కేంద్రం"గా నామకరణం చేశామని పేర్కొన్నారు. ఈ ఆసుపత్రిలో రోగులకు చికిత్స అందించడానికి 4 పడకలతో కూడిన గది, టీవీ, బాల్కనీ ఉన్నాయని 15 రకాల వైద్య పరీక్షలు ఇక్కడ అందుబాటులో ఉంచారని వెల్లడించారు. ఈ ఆసుపత్రి ద్వారా సాలూరు మండలంలోని 10 గ్రామాల గిరిజనులకు సేవలందనున్నాయని మంత్రి పేర్కొన్నారు.

విరామం

=====================

దక్షిణ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం రాబోయే 24 గంటల్లో మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని విశాఖపట్నంలోని తుఫాను హెచ్చరికల కేంద్రం తెలిపింది. ఈ ప్రభావంతో దక్షిణకోస్తా, ఉత్తరకోస్తా ప్రాంతాల్లో రానున్న రెండు రోజుల పాటు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ నెల 28, 29వ తేదీల్లో నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. తీర ప్రాంతాల్లో 35 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని.. వరికోతలు చేపడుతున్న రైతులు అప్రమత్తంగా ఉంటూ... తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

=====================

ప్రజల దాహార్తిని తీర్చేందుకు గజపతినగరం నియోజకవర్గంలో 300 కోట్ల రూపాయలతో తాగునీటి పథకాన్ని నిర్మించనున్నామని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గజపతినగరం నియోజకవర్గం పరిధిలోని గంట్యాడ, బొండపల్లి, గజపతినగరం మండలాల్లో ఈరోజు మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. గంట్యాడ మండలం పెదవేమలి గ్రామంలో 23.50 లక్షల రూపాయలతో నాలుగు

రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు కృషి చేస్తున్నామని, దీనిలో భాగంగా తాటిపూడి జలాశయం నీటితో ఈ పథకాన్ని నిర్మిస్తామన్నారు. గ్రామాల్లో అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ....

(వాయిస్ 35 సెకన్లు)

=====================

భారత ప్రభుత్వం చేపట్టిన ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్..లో భాగంగా 10 రోజుల పాటు ఎక్స్ పోజర్ టూర్ కోసం ఆంధ్రప్రదేశ్ లోని వివిధ జిల్లాల నుండి వచ్చిన 42 మంది విద్యార్థులు ఈ రోజు విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాల ఆధ్వర్యంలో అలహాబాద్ ఐఐటీ కళాశాలకు బయలుదేరి వెళ్తున్నారు. ఈ సందర్భంగా విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అధ్యాపకులు మట్లాడుతూ... కొత్త వాతావరణం, విభిన్న సంస్కృతులు ఆచారాల గురించి తెలుసుకోవడానికి విద్యార్థులకు ఇటువంటి పర్యటనలు చాలా సహాయపడతాయన్నారు. కొత్త ప్రదేశాలను సందర్శించడం, విభిన్న సంస్కృతులను తెలుసుకోవడం ద్వారా సృజనాత్మకత మరింత పెరుగుతుందనీ విద్యార్థులు ఆకాశవాణితో మాట్లాడుతూ....

(వాయిస్ 20 సెకన్లు)

=====================

కార్తీక మాసం ఆఖరి సోమవారం కావడంతో ఈరోజు రాష్ట్రంలోని శైవ క్షేత్రాల్లో భక్తి శ్రద్దలతో పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. తిరుపతి జిల్లాలోని ప్రముఖ వాయులింగ క్షేత్రం శ్రీకాళహస్తీశ్వర ఆలయం భక్తులతో కార్తీక శోభ సంతరించుకుంది. ఆలయ ఆవరణంలో రంగుల గోపురం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదేశంలో భక్తులు కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేశారు. శ్రీకాళహస్తి దేవస్థానంలో భక్తులు స్వామి అమ్మవారి దర్శనార్థం అధిక సంఖ్యలో రావడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

=====================

మహిళలపై లైంగిక వేధింపులు, గృహ హింస, బాలికలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టేందుకు అవగాహన, చైతన్యం అవసరమని పార్వతీపురం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. అంతర్జాతీయ స్త్రీ హింస నిరోధక దినోత్సవం సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచార ర్యాలీని ఈరోజు కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. అనంతరం పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో కార్యక్రమంపై గోడ పత్రికలను ఇతర జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ఈరోజు నుంచి డిసెంబర్ 23వ తేదీ వరకు జరగనుందని, భారత రాజ్యాంగం ప్రాథమిక హక్కులతో పాటు మహిళల పట్ల గౌరవం ఉండే న్యాయమైన, సమానత్వ సమాజానికి పునాది వేసిందని పేర్కొన్నారు.

=====================
=====================